సంపుటి :02 సంచిక :117 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 27 , జూన్ 2025

## వారిని అసలే వదలొద్దు



- ఆర్గనైజ్డ్ క్రైమ్స్‌పై దృష్టి పెట్టండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- టాస్క్ ఫోర్స్ కార్యాలయం సందర్శన

02



## రూ.4.70 కోట్లతో రోడ్డు

- నిర్మాణ పనులను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- జిల్లా కేంద్రానికి తగ్గనున్న దూర భారం

02

## పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

తెలంగాణ విద్యాశాఖ శుక్రవారం పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేసింది. విద్యార్థులు ఈనెల 3వ తేదీ నుంచి 13 వరకు పరీక్షలు రాశారు. పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 42,832 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుని, 38,741 మంది హాజరయ్యారు. ఫలితాల ప్రకారం.. వీరిలో 24,415మంది (73.35 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. విద్యార్థులు విద్యాశాఖ వెబ్ సైట్‌లో తమ రోల్ నంబర్ ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చని సూచించారు.

- అక్షరదర్బార్, హైదరాబాద్

03





## టీజీ ఎప్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి బ్యాచ్‌లర్ ఆఫ్ ఇంజినీరింగ్ (బీటెక్) సీట్ల భర్తీకి సంబంధించిన ఎప్‌సెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేశారు. పాత ఫీజుల ప్రకారమే కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. మొత్తం మూడు దశల్లో బీటెక్ సీట్లను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

-అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

05



## పేద పిల్లలకు భోజనం పెట్టలేని ప్రభుత్వం

- అందాల పోటీదారులకు మాత్రం విందుకు రూ.లక్షలకు లక్షలు
- కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

02

# దర్జాగా కమీషన్ దందా




### బ్యాంకుల వద్ద కాపుగాస్తున్న దళారులు

- రుణాల రెన్యువల్ కు వచ్చే రైతులకు గాలం
- తాకట్టు నుంచి బంగారం విడిపిస్తాం.. క్రాప్ లోను అసలు కడతామంటూ బేరం
- బ్యాంకు సిబ్బంది సహకారంతో చకచకా పనులు
- రూ.లక్ష రుణానికి రూ.2 వేల నుంచి రూ.3 వేల కమీషన్

మరిపెడకు చెందిన ఓ మహిళా రైతు బ్యాంకులో రూ.3 లక్షల వ్యవసాయ రుణం తీసుకున్నది. వచ్చే ఆదాయంలో ఇంట్లో శుభాకార్యాలు, పిల్లల చదువులకు ఎక్కువ ఖర్చవడంతో రుణం తీర్చలేకపోయింది. ఎలాగైనా వడ్డీ, అసలు చెల్లించి.. మళ్లీ రుణం తీసుకుని సాగు చేయాలనుకున్నది. ఈ అవసరాన్ని అదనుగా తీసుకున్న ఓ దళారి ఆమెతో బేరమాడి రూ.5 వేల వరకు కమీషన్ తీసుకుని బ్యాంకు రుణం విడిపించాడు. మిగిలిన డబ్బు మహిళా రైతు చేతిలో పెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అలాగే గుండెపుడికి చెందిన ఒక రైతు బ్యాంకులో రూ.70 వేల వ్యవసాయ రుణం తీసుకున్నాడు. దళారి అతని వద్ద రూ.1,500 కమీషన్ తీసుకుని, రుణం విడిపించాడు. అదే దళారి గిరిపురం గ్రామానికి చెందిన ఓ మహిళా రైతుతో బేరమాడి, కమీషన్ కుదుర్చుకుని, నిమిషాల్లో బ్యాంకులోకి వెళ్లి, సిబ్బందితో మాట్లాడి.. చకచకా రుణం విడిపించి, కొత్త రుణం ఇప్పించి.. తన కమీషన్ తాను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత మరో రైతుతో బేరమాడాడు. మళ్లీ బ్యాంకు లోపలికి వచ్చాడు. ఈ దృశ్యాలన్నీ శుక్రవారం ఒక్కరోజే మరిపెడ మండల కేంద్రంలోని ప్రధాన బ్యాంకుల వద్ద కనిపించాయి. మరి సీజన్ మొత్తంలో దళారుల దందా ఏ రేంజ్లో ఉంటుందో ఇట్టే ఊహించుకోవచ్చు. —అక్షర దర్బార్, మరిపెడ

02

## సంక్షోభంలో తెలంగాణ సాగునీటి రంగం

- ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేదు... కొత్త ప్రాజెక్టులపై ఆలోచన లేదు
- దుష్ప్రచారం ఆపేసి ప్రాజెక్టుల నిర్వహణపై సీఎం దృష్టి సారించాలి
- మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం



05



## గణేష్ కు వృద్ధుల ఘన నివాళి

నాడు మమ్మల్ని కాపాడావంటూ విలపించిన వృద్ధ దంపతులు

02

## రహదారుల భద్రతపై తనిఖీలు నిర్వహించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో రోడ్డు భద్రతపై సమీక్షా



# పేద పిల్లలకు భోజనం పెట్టలేని పరిస్థితిలో ప్రభుత్వం

- అందాల పోటీదారులకు మాత్రం విందుకు రూ.లక్షలకు లక్షలు
- కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం కడుపు నిండా భోజనం పెట్టలేని పరిస్థితిలో ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన 'అన్నపు రాశులు ఒకచోట, ఆకలి మంటలు ఒకచోట .. హంస తూలికలు ఒకచోట, అలసిన దేహాలు ఒకచోట' అని కవి కాళోజీ నారాయణరావు కవిత్వాన్ని ఉటంకించారు. దేశ విదేశాలకు చెందిన అందాల తారలను, హైదరాబాద్‌కు రప్పించి బ్యూటీ పోటీల్లో విందులకు ఒక ప్లేటుకు రూ.లక్ష ఖర్చు చేసిన ప్రభుత్వం పేద పిల్లలకు పట్టెడన్నం పెట్టలేకపోతున్నదన్నారు. వేములవాడలో ఇటీవల జరిగిన కాంగ్రెస్ సభలో రాజన్న ఆలయ ఆదాయంతో ప్రభుత్వం పెద్దలు, అతిథులకు ఒక ప్లేటకు రూ.36 వేల చొప్పున ఖర్చు చేసిందన్నారు. ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తామంటూ వందల కోట్లు దండుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లు పిలుస్తున్నదని ధ్వజమెత్తారు. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తూ.. భావి తెలంగాణ భవిష్యత్తును ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బలిపెడుతున్నదన్నారు. నాడు దేశానికి దిక్సూచిలా నిలిచిన తెలంగాణ విద్యావ్యవస్థ ఇప్పుడు ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తంగా మారిందన్నారు.



# దర్జాగా 'కమీషన్' దందా!

- బ్యాంకుల వద్ద కాపుగాస్తున్న దళారులు
- రుణాల రెన్యువల్ కు వచ్చే రైతులకు గాలం
- తాకట్టు నుంచి బంగారం విడిపిస్తాం.. క్రాప్ లోను అసలు కడతామంటూ బేరం
- బ్యాంకు సిబ్బంది సహకారంతో చకచకా పనులు
- రూ.లక్ష రుణానికి రూ.2 వేల నుంచి రూ.3 వేల కమీషన్



అక్షరదర్బార్, మరిపెడ: వానకాలం సీజన్ వచ్చేసింది. రైతులుపొలం పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. పెట్టుబడి సాయం సమకూర్చుకున్న రైతులు దర్జాగా సాగు పనులు ప్రారంభించక, పెట్టుబడి లేదని రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ, వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. వారి అవసరాలను బలహీనతగా తీసుకున్న కొందరు అక్రమార్కులు మధ్యవర్తుల అవతారం ఎత్తుతున్నారు. అప్పటికే బ్యాంకులో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టిన వారు, వ్యవసాయ రుణం తీసుకున్నవారిని గుర్తించి వారికి గాలం వేస్తున్నారు. 'బ్యాంకు రుణం మేం తీరుస్తాం. బంగారాన్ని విడిపిస్తాం. రుణం విడిపించాక వచ్చే కొత్త రుణంలో మాకింత కమిషన్ కావాలి. ఆభరణాలు బయటకు విడిపించాక.. మాకు రూ.పదివేలకు ఫలానా కమిషన్ ఇవ్వాలి' అని డిమాండ్ చేస్తున్నారు. గత్యంతరం లేని రైతులు వారిని ఆశ్రయిస్తున్నారు. చేసేదేంలేక వారితో ఆభరణాలు విడిపించుకుని, వ్యవసాయ రుణం తీర్చి కొత్త రుణాలు తీర్చుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ప్రధాన బ్యాంకుల బయట కాపుగాసి దళారులు ఈ దందా సాగిస్తున్నారు.

**- అవసరాన్ని బట్టి కమీషన్..**

వ్యవసాయ సీజన్ రాగానే రైతులకు పంట పెట్టుబడి అవసరమవుతుంది. దీంతో వారు తమ భూములు, బంగారాన్ని తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటారు. బ్యాంకులో రుణం తీసుకోవాలంటే, రైతులు తప్పనిసరిగా గతంలో తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే బ్యాంకులు రైతులకు కొత్త రుణాలు అందిస్తాయి. అదే బంగారం తాకట్టు రుణమైతే, అప్పటి వరకు పోగైన వడ్డీతో సహా అసలు చెల్లించాల్సి ఉంటుంది. రైతులు వడ్డీ, అసలు చెల్లించి మళ్లీ అదే బంగారాన్ని తనఖా పెడతారు. బ్యాంకులు అప్పుడున్న ధర ప్రకారం రైతులకు బంగారంపై రుణాలు అందిస్తాయి. ఒకవేళ రైతు వద్ద మొత్తం డబ్బులు లేకపోతే, కేవలం వడ్డీ మాత్రమే తీసుకొని మళ్లీ అదే ఖాతాపై గతంలో తీసుకున్న రుణం మొత్తాన్ని రెన్యువల్ చేస్తాయి. అలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న రైతులను దళారులు గుర్తిస్తారు. బ్యాంకుకు తామే అసలు, వడ్డీ మొత్తం చెల్లిస్తామంటారు. రూ.50 వేల వరకు రూ.వెయ్యి నుంచి రూ.1,500, రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు రూ.2 వేల నుంచి 3 వేల వరకు, రూ.3 లక్షలకు రూ.3 వేల నుంచి రూ.4,500 కమిషన్ దండుకున్నారు.

**- ప్రధాన బ్యాంకులో దందా..**

మరిపెడలోని ఓ ప్రధాన బ్యాంకులో దళారుల దందా ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు కొనసాగుతున్నది. రైతులతో గేటు బయటే బేరం కుదుర్చుకుని చక్రం తిప్పుతున్నారు. రైతుల రుణం చెల్లించి, తిరిగి వారు రుణం తీసుకునే వరకు ఉండి.., లేదంటే రుణం రెన్యువల్ అయ్యే వరకు ఉండి కమీషన్ తీసుకుంటున్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలతోనే దళారులు ఈ దందా సాగిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కసారి ఒక దళారికి ఒక బేరం కుదిరిందంటే అతడు సరాసరి బ్యాంకులోపలికి వెళ్లి.. సదరు రైతులకు సంబంధించిన పనులన్నింటినీ చక్కబెడుతుండటం స్థానికంగా చర్చనీయాంశమైంది. క్యూలైన్లలో నిలబడిన ఖాతాదారుల కంటే, దళారులకు సంబంధించిన పనులనే బ్యాంకు సిబ్బంది పనులనే త్వరగా పూర్తి చేస్తున్నారని తెలిసింది. దళారులే స్వయంగా ఓచర్లు రాస్తున్నారని సమాచారం. అక్రమంగా కమిషన్ దోచుకునే దళారుల బారిన పడకుండా, ప్రభుత్వం చొరవ తీసుకుని బ్యాంకు నిబంధనలు సడలించాలని, కేవలం వడ్డీలు చెల్లించుకుని రుణాలు రెన్యువల్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# వారిని అసలే వదలొద్దు

- ఆర్గనైజ్డ్ క్రైమ్స్ పై దృష్టి పెట్టండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- టాస్క్ ఫోర్స్ కార్యాలయం సందర్శన



అక్షరదర్బార్, హనుమకొండ: ఆర్గనైజ్డ్ క్రైమ్స్ కు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితిలో వదలొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ టాస్క్ ఫోర్స్ పోలీసులను అదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం తొలి సారిగా సందర్శించారు. టాస్క్ ఫోర్స్ కార్యాలయానికి చేరుకున్న సీపీకి టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీ మొదటగా టాస్క్ ఫోర్స్ కార్యాలయం పరిసరాలను పరిశీలించిన అనంతరం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు టాస్క్ ఫోర్స్ అధికారులు ఎలాంటి విధులు నిర్వహిస్తున్నారు.. ఇప్పటి వరకు ఎలాంటి నేరగాళ్ళను పట్టుకున్నారు, మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వ్యక్తుల సమాచారం కోసం బలమైన ఇన్ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంతో పాటు క్షేత్ర స్థాయిలో సమాచారాన్ని సేకరించాలని, టాస్క్ ఫోర్స్ లో క్వాలిటీ వర్క్ కావాలని, నేరానికి సంబందించి మూలాలకు వెళ్ళి నేరస్తులను పట్టుకోవాలని, తప్పుడు చర్యలకు పాల్పడితే టాస్క్ ఫోర్స్ పోలీసులకు పట్టుబడుతామని నేరస్థులకు భయం కలిగిస్తూనే ప్రజలకు టాస్క్ ఫోర్స్ పోలీసులపై నమ్మకం, గౌరవాన్ని పెంపొందించాలని, అలాగే టాస్క్ ఫోర్స్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో వ్యవహరించవద్దని, అలాంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.

# ఇసుక దందాపై తిరగబడిన జనం

- ఏకమైన బంగ్లపల్లి గ్రామస్థులు
- అక్రమ ఇసుక దందాపై ఆగ్రహం
- ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించిన గ్రామస్తులు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం బంగ్లా పెల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు గ్రామస్తులు పట్టుకొని మొగుళ్ళపల్లి పోలీసులకు మరియు రెవిన్యూ అధికారులకు సమాచారం అందించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బంగ్లా పల్లి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా మెట్టుపల్లి గ్రామానికి చెందిన ఒక రాజకీయ నాయకుడు లీజు ట్రాక్టర్లను తీసుకువచ్చి అక్రమంగా వేములపల్లి వాగు నుండి ఇతర ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాడని పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన ఇసుక అక్రమ రవాణా ఆగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అధికారులకు ఫిర్యాదులు చేసిన రెవెన్యూ అధికారులు స్పందించిన దాఖలాలు లేకపోవడంతో బంగ్లా పెల్లి గ్రామస్తులం ఏకమై అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ను పట్టుకొని మొగుళ్లపల్లి పోలీసు మరియు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు ఇకనుండి వేములపల్లి వాగు నుండి ఎవరైనా అక్రమ రవాణా చేస్తే గ్రామస్తులం ఏకమై పోలీసులకు సమాచారం అందిస్తామని.. అధికారం అడ్డం పెట్టుకొని జనాన్ని మోసంచేస్తే సహించేది లేదని గ్రామస్తులు హెచ్చరించారు.

# మావోయిస్టు గణేష్ కు ఘన నివాళి

అక్షరదర్బార్, టేకుమట్ల: మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి అలియాస్ గణేష్ చిత్రపటానికి ఓ వృద్ధ దంపతులు ఘనంగా నివాళులర్పించారు. టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన వీరవేణ లక్ష్మి, ఓదెలు దంపతులను 30 ఏళ్ల క్రితం తమ పాలివారు బెదిరింపులకు గురి చేస్తూ, కొట్టడంతో పాటు చంపేస్తామని బెదిరించడంతో గణేష్ దళానికి విషయం తెలియడంతో, ఇద్దరు సభ్యులు వచ్చి లక్ష్మి, ఓదెలు జోలికి రావద్దని తీవ్రంగా హెచ్చరించారు. దీంతో ఆ దంపతులు ఇద్దరు తమ ప్రాణాలకు రక్షణ కల్పించిన అన్నలపై ఎంతో మక్కువ పెంచుకున్నారు. ఈ క్రమంలో గణేష్ మరణ వార్త విని తీవ్ర కలత చెందిన వృద్ధ దంపతులు శుక్రవారం వెలిశాలలోని గణేష్ ఇంటికి వచ్చి గణేష్ సోదరుడు అశోక్ తో కలిసి గణేష్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అశోక్ తో తమకు జరిగిన న్యాయం గురించి చెప్పుకుంటూ తీవ్ర మనోవేదనతో కంటతడి పెట్టుకున్నారు. 30 ఏళ్ల నాటి సహాయం మర్చిపోకుండా పనులు వదిలేసుకుని వచ్చి గణేష్ చిత్రపటం వద్ద నివాళులర్పించడం పట్ల ఆ వృద్ధ దంపతులను చూసిన పలువురు భావోద్వేగానికి గురయ్యారు.

# గ్రోమోర్ స్టోర్ ప్రారంభం



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ శుక్రవారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలో నూతనంగా మన గ్రోమోర్ వ్యవసాయ స్టోర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఏ భూపాలపల్లి ఎన్.రమేశ్, ఎంఏఓ పి. సురేందర్ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు ప్రభుత్వ అధికారులు రైతులు, కంపెనీ అందిస్తున్న నూతన సేవలు మరియు నాణ్యమైన వ్యవసాయ పనిముట్లను ఆసక్తిగా పరిశీలించారు.

# కామ్రేడ్ గాజర్ల రవికి జర్నలిస్టుల నివాళి

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్ : కామ్రేడ్ గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ మృతికి సంతాపంగా టీయూడబ్ల్యూజే ఐజేయూ భూపాల పల్లి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు క్యాతం సతీష్ , సామంతుల శ్యామ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నివాళులర్పించారు. వెలిశాల గ్రామంలో శుక్రవారం గాజర్ల రవి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో చిట్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఐలయ్య జర్నలిస్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడెపు మహేందర్ మృతికి సంతాపం

అక్షర దర్బార్, పరకాల : సీనియర్ జర్నలిస్టు హన్స్ ఇండియా వరంగల్ బ్యూరో చీఫ్ ఆడెపు మహేందర్ (55) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. కాగా, టీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు టీవీ రాజు, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దామెర రాజేందర్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతికి టీడబ్ల్యూజెఎఫ్ సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.





# గుడుంబా కేంద్రాలపై ఎక్సైజ్ రైడ్స్

- కల్తీసారాయి అమ్ముతూ పట్టుబడిన 10 మంది
- 40 లీటర్ల కల్తీసారాయి, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం
- సారాయి తాగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సీఐ హెచ్చరిక
- నాటుసారాయి కాస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్న సీఐ
- వరంగల్ ఎన్ ఫోర్స్ మెంట్, మహబూబాబాద్ టాస్క్ ఫోర్స్, గుడూరు ఎక్సైజ్ సంయుక్త దాడులు



అక్షర దర్బార్,కేసముద్రం : కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో అబ్కారీ శాఖ ఆకస్మిక దాడులు చేసింది. గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఇటీవల కల్తీ సారాయి ప్యాకెట్లు గ్రామంలో కలకలం రేపడం సంచలనంగా మారింది. పలువురు మతిస్థిమితం కోల్పోయిన ఘటనలు వెలుగు చూశాయి. దీంతో ఎక్సైజ్ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్ రావు, మహబూబాబాద్ DPEO బి.కిరణ్ ఆదేశాలతో గూడూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెనుగొండ గ్రామంలో శుక్రవారం ఉదయం వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మహబూబాబాద్ టాస్క్ ఫోర్స్, గూడూరు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా రైడ్స్ చేసినట్టు గుడూరు ఎక్సైజ్ సీఐ ఎన్.భిక్షపతి తెలిపారు. ఈ దాడులలో నాలుగు కేసులు నమోదు చేసి, 10మందిని అదుపులోకి తీసుకొని, 40 లీటర్ల నాటు సారా, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. పిల్లలమర్రి సక్కుబాయి, గాడిపెల్లి లక్ష్మి, భర్త వీరయ్య, పెండ్యాల వీరయ్య, నలమాస లక్ష్మి, గాడిపెల్లి కౌసల్య, గాడిపెల్లి లక్ష్మి, భర్త వెంకటయ్య, షేక్ ఖాజాబీ, ఆడెపు విజయ, బెజ్జం వీరస్వామి, లాక రామనరసమ్మ ఈ పది మందిని అదుపులోకి తీసుకొని కేసముద్రం తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేయటం జరిగిందన్నారు. దాడులలో వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కే నాగయ్య, ఎస్ఐ ఎన్ రజిత, మహబూబాబాద్ టాస్క్ ఫోర్స్ సీఐ సీహెచ్ నీరజ, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ ఆర్ కిరీటి, గూడూరు ఎస్ఐ రాజేశ్వరి, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, మహబూబాబాద్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది, గూడూరు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# వ్యాపార లైసెన్సులు తీసుకోవాలి

## పాత బకాయిలను త్వరగా చెల్లించాలి

## మున్సిపల్ కమిషనర్ సుష్మ

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణ వర్తక వ్యాపారస్తులు తప్పనిసరిగా వ్యాపార లైసెన్సులు తీసుకోవాలని పరకాల మున్సిపల్ కమిషనర్ కే సుష్మ తెలిపారు. పరకాల పురపాలక సంఘ కార్యాలయంలో పట్టణంలోని వర్తక వ్యాపారులతో శుక్రవారం పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వ్యాపార సముదాయాలు తప్పనిసరిగా వ్యాపార లైసెన్స్ తీసుకోవాలని ప్రభుత్వ గెజిట్ నిబంధనల ప్రకారం క్యూఆర్ కోడ్ తో ఆన్లైన్ పేమెంట్ చేసి రసీదు పొందాలని కోరారు. లైసెన్స్ లేని వ్యాపార సముదాలపై మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. పాత బకాయిలు పూర్తిగా చెల్లించి పరకాల పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు.

# ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు

అక్షర దర్బార్, దుగ్గొండి: దివ్యాంగురాలు, ఎంతో మందికి ధైర్యాన్నిస్తూ మార్గదర్శిగా నిలిచిన హెలెన్ కిల్లర్ 145వ జయంతి వేడుకలను శుక్రవారం దుగ్గొండి మండల కేంద్రంలో దివ్యాంగులు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతిని పురస్కరించుకొని దుగ్గొండి మండల కేంద్రంలో గల బస్టాండ్ లో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక దుగ్గొండి మండల అధ్యక్షులు చింత కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించగా వరంగల్ జిల్లా అధ్యక్షులు అడ్డ రాజు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక వరంగల్.జిల్లా అధ్యక్షులు అడ్డ రాజు, దుగ్గొండి మండల అధ్యక్షులు చింత కుమార్ స్వామి, నాయకులు నగేష్, రాజబాబు, లక్ష్మి, రేణుక, సమయ్య, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే దొంతి స్థల పరిశీలన



అక్షర దర్బార్, నర్సంపేట : నియోజకవర్గంలోని ఖానాపురం మండలం అశోక నగర్ గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మించనున్న స్థలాన్ని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గానికి నూతనంగా మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇటీవల రూ.200 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ లో పేద విద్యార్థుల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి అన్ని సౌకర్యాలతో 30 ఎకరాలలో విశాలవంతమైన అదునాతణమైన భవనాలు నిర్మించనున్నట్టు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం స్థలాన్ని సేకరించాలని అధికారులకు సూచించారు.

# స్టేట్ ఫస్ట్ ర్యాంకు విద్యార్థికి సన్మానం

అక్షర దర్బార్, చిట్యాల : పాలిటెక్నిక్ 2025 ఎంట్రన్స్ టెస్ట్ లో సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఇంటిగ్రేటెడ్ ర్యాంక్ స్టేట్ 9th ర్యాంక్ సాధించి జేఎన్టీయూ హైదరాబాదులో సివిల్ ఇంజనీరింగ్ లో సీటు సంపాదించిన గోల్కొండ నిఖిల్ కౌశిక్ ను చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హై స్కూల్ అధ్యాపక బృందం శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ తమ పాఠశాల పూర్వ విద్యార్థి నిఖిల్ కౌశిక్ కష్టపడి చదవడం వల్లే ఈరోజు తల్లిదండ్రులకు పాఠశాలకు, మండలానికి పేరు తీసుకొచ్చాడని అభినందించారు.






# బాలాజీలో ఘనంగా ఉద్యమి భారత్ వేడుకలు

అక్షర దర్బార్, నర్సంపేట: లక్నేపల్లి బాలాజీ టెక్నో స్కూల్లో ఎన్సీసీ పదవ బెటాలియన్ సూచనల మేరకు ఎం. ఎస్ .ఎం .ఈ డే 2025 ఉద్యమి భారత్ కార్యక్రమం వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాలాజీ టెక్నో స్కూల్ ఎన్ సి సి థర్డ్ ఆఫీసర్ ఎం.డి రియాజుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి. ముఖ్యఅతిథిగా బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పి. రాజేందర్ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థలో ఎం.ఎస్ ఎం.ఈ పాత్ర ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, రవీందర్ రెడ్డి ,రామ్మూర్తి ,రాజేష్ ,లక్ష్మణ్ మరియు ఎన్.సి.సి క్యాడెట్లు పాల్గొన్నారు

## కొత్త సీసా పాత మందు

- డా. కాళీ ప్రసాద రావు
- ప్రశ్నిస్తే కేసులా... నా మీద ఓడిన వ్యక్తులే ఆరోపణలు చేపిస్తున్నారు
- మాజీ కౌన్సిలర్ ఆర్పీ జయంత్ లాల్

అక్షర దర్బార్, పరకాల : .బిఆర్ఎస్ లో ఉండి పరకాల మున్సిపాలిటీలో చక్కదిద్దిన వ్యక్తులే నేడు కాంగ్రెస్ పార్టీలో చేరి కొత్త సీసా పాత మందులాగా వ్యవహరిస్తున్నారని బిజెపి నేత ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద రావు పేర్కొన్నారు.



శుక్రవారం పరకాల పట్టణంలోని బిజెపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, బీజేపీ మాజీ కౌన్సిలర్ ఆర్పి జయంతి లాల్ పరకాల మున్సిపల్ కమిషనర్ జయంతిలాల్ పై పెట్టిన కేసును ఖండించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ మున్సిపాలిటీ అవినీతిమయమైందని, బీఆర్ఎస్ లో అవినీతి చేసిన నాయకులే నేడు కాంగ్రెస్ పార్టీలో చేరారని, కాంగ్రెస్ పార్టీ రాబోయే పరకాల మున్సి పాలిటీ ఎన్నికలలో ఒక సీటు కూడా సాధించలేదని దానితో బిజెపి పై అక్కసుతో బద్నాం చేస్తున్నారని అన్నారు. దానిపై పరకాల మాజీ కౌన్సిలర్ ఆర్పీ జయంతి లాల్ ప్రజల పక్షాన పోరాడితే అతనిపై కేసు పెట్టడం హేయమైన చర్య అని అన్నారు. బిజెపి మాజీ కౌన్సిలర్ పై కేసు పెట్టడంలో ఎమ్మెల్యే హస్తము ఉందని అన్నారు. జయంత్ అసభ్య పద జాలంతో మాట్లాడినట్లయితే కమిషనర్ కు క్షమాపణ చెప్పి స్తానని అన్నారు. బిజెపి మాజీ కౌన్సిలర్ జయంతిలాల్ వెంట ఉంటామని కేసును ఖండిస్తూ మాజీ కౌన్సిలర్ పై ఏమైనా చర్యలు తీసుకుంటే బిజెపి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. పురపాలక సంస్థలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ప్రశ్నించినందుకే అక్కసుతో తనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 9వ వార్డులో అక్రమ నిర్మాణం అని దళితుల ఇల్లు కూలగొట్టిన మున్సిపల్ అధి కారులు కాంగ్రెస్ లీడర్ నిబంధనలకు విరుద్ధంగా ఇల్లు కట్టుకుంటే సహకరించారని ఆరోపించారు.



# దివ్యాంగులకు అండగా ఉంటాం

- ఐటీ మినిష్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- మహదేవపూర్ లో దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ
- కాటారంలో సంస్థాగత ఎన్నికలపై కార్యకర్తలతో సమావేశం

అక్షర దర్బార్, కాటారం: దివ్యాంగులు సాధారణ వ్యక్తులతో సమానత్వం తో పాటు గౌరవంగా జీవించేందుకు గాను కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లపుడు అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.శుక్రవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలీం కో సంస్థ ద్వారా అందిస్తున్న దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు, ఇతర ఉపకరణాలు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో అన్ని రంగాల్లో రాణించేందుకు అవసర



మైన సౌకర్యాలు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దివ్యాన్గులకు అవసరమైన ఉపకరణాలను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దివ్యాంగుల సంక్షేమానికి అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. మహదేవ్ పూర్ మండలంలో సుమారు 200 మంది దివ్యాంగులను గుర్తించడం జరిగిందని వారిలో మొదటి విడతలో 50 మంది దివ్యాంగులకు వివిధ రకాలైన బ్యాటరీ ట్రై సైకిళ్ళు, సాధారణ ట్రై సైకిళ్ళు, వినికిడి పరికరాలు, చేతి కర్రలు, స్టాండ్ లు వారి వారి వైకల్యాన్ని బట్టి అందిస్తున్నామన్నారు.నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి ఒకొక్క హామీని నెరవేరుస్తున్నామని తెలిపారు.అనంతరం మహదేవ్ పూర్ మండలానికి చెందిన 89 మంది లబ్ధిదారులకు సుమారు 90 లక్షల రూపాయల విలువగల కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, సీడీపిఓ రాధిక,మహదేవపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్,పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి,నాయకులు రవిచందర్, నాగరాజు, వెంకటరమణ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమూనూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపి పంతకాని సమ్మయ్య, అంగజాల అశోక్,మహేష్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## పిడిసిల్ల ఇన్చార్జి డీలర్ గా వలసాని వీరన్న

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల తాత్కాలిక రేషన్ డీలర్ గా మెట్ల పల్లి గ్రామానికి చెందిన వలసాని వీరన్న కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది, పిడిసిల్ల డీలర్ వంగ ధనలక్ష్మి లబ్ధిదారులకు తూకంలో తక్కువ ఇస్తున్నట్లు ఆరోపణలు రావటంతో మొగుళ్ళపల్లి తహసిల్దార్ తాత్కాలికంగా సస్పెండ్ చేసి ఎల్లారెడ్డి పల్లె డీలర్ నిమ్మల భద్రయ్యకు బాధ్యతలు అప్పగిస్తూ ఆర్డర్ ఇచ్చారు. అయితే ఒకే రోజులో మళ్లీ ఆర్డర్ తారుమారు చేస్తూ.. మొట్లపల్లి గ్రామానికి చెందిన వలసాని వీరన్న కు తాత్కాలిక డీలర్గా ఇన్చార్జి ఇవ్వటం మండలంలో చర్చనీయాంశమైంది.



## టీయూడబ్ల్యూజే ఐజేయూ మూడు మండలాల కన్వీనర్ గా పుల్ల రవితేజ

అక్షర దర్బార్ చిట్యాల : టీయూడబ్ల్యూజే (ఐజేయూ) చిట్యాల,మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల కన్వీనర్ గా చిట్యాల మండల కేంద్రానికి చెందిన పుల్ల రవితేజను



నియమించినట్లు జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్ తెలిపారు. చిట్యాల ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధి కోసం గత కొన్ని సంవత్సరాల నుండి పనిచేస్తున్న రవితేజను నియమించామని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాట్రేవుల ఐలన్న ప్రెస్ క్లబ్ నాయకులు కట్కూరి శ్రీనివాస్ బుర్ర రమేష్ గుర్రపు రాజమౌళి సరిగోమ్ముల రాజేందర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలి

ఏబీఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల నరేష్

అక్షర దర్బార్, నర్సంపేట: వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని ఏ బి ఎస్ ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల నరేష్ విద్యాశాఖ ఉన్నతాధికారులను శుక్రవారం కోరారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న మంచినీటి సమస్య, మరుగుదొడ్ల మరమ్మతు మరియు, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ అమలు చేసే విధంగా అధికారులు నిరంతరం పర్యవేక్షించి విద్యార్థులకు నాణ్యతమైన భోజనం



అందించే విధంగా చర్యలు చేపట్టాలని, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలతో పాటు కస్తూర్బా గురుకుల పాఠశాలలో అదనపు సెక్షన్లు ఏర్పాటు చేయాల్సిందిగా వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ బన్నీ తదితరులు పాల్గొన్నారు

## బస్సు సౌకర్యం కల్పించాలి

- కళాశాల చుట్టూ ప్రహరి నిర్మించాలి
- బహుజన సంక్షేమ సంఘం, బహుజన స్టూడెంట్ యూనియన్ డిమాండ్

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని బహుజన సంక్షేమ సంఘం, బహుజన స్టూడెంట్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్, మంద సురేష్ మాట్లాడుతూ.. కళాశాలకు వచ్చే విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారని, బస్సు సౌకర్యం లేక చాలామంది నిరుపేద విద్యార్థులు కళాశాలకు రాలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చొరవ తీసుకోవాలని కోరారు.

## నేషనల్ ఫ్యామిలీ హెల్త్ స్కీమ్ సద్వినియోగం చేసుకోవాలి

అక్షర దర్బార్, చిట్యాల : నేషనల్ ఫ్యామిలీ హెల్త్ స్కీమ్ ను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల తహసీల్దార్ ఇమామ్ బాబా కోరారు. 18 నుండి 59 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న కుటుంబ పెద్ద ఏదైనా కారణం చేత మరణిస్తే అతని కుటుంబానికి సహాయం కింద రూ.20 వేలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకువచ్చి రెవెన్యూ కార్యాలయంలో ఇవ్వాలని కోరారు.

## పోస్ట్ పేమెంట్ బ్యాంక్ పాలసీకి గొప్ప స్పందన

అక్షర దర్బార్, పరకాల : ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ తీసుకువచ్చిన తక్కువ ధరకే అధిక ప్రయోజనాల గల యాక్సిడెంట్ భీమా పాలసీకి ప్రజల నుండి కార్మికుల నుండి అద్భుతమైన స్పందన లభిస్తున్నదని ఇండియన్ పోస్ట్పేమెంట్ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ కమల్ అన్నారు. శుక్రవారం బిర్లా సిమెంటు ఉద్యోగులు,కార్మిక సంఘ సభ్యులు పాలసీని తీసుకున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది చాలా మంచి అవకాశమని ఇతర కార్మిక సంఘాలతో పాటు అందరూ పాలసీ తీసుకోవాలని, మనం పని చేస్తున్నంత వరకూ భద్రత అవసరమవుతుందని, పాలసీ వివరాలకు 8885111943 నెంబర్ కు లేదా సమీప ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ చుంచు కమలాకర్ ని సంప్రదించాలని కోరారు.



# సంక్షోభంలో తెలంగాణ సాగునీటి రంగం

- ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేదు... కొత్త ప్రాజెక్టులపై ఆలోచన లేదు
- ప్రాజెక్టుల నిర్వహణపై సీఎం దృష్టి సారించాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: సాగు నీటి రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పట్ల మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేక, కొత్త ప్రాజెక్టుల ఆలోచన లేక తెలంగాణ సాగు నీటి రంగాన్ని కాంగ్రెస్ సంక్షోభంలోకి నెడుతున్నదని శుక్రవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్ళు తెరవాలని, మేడిగడ్డపై దుష్ప్రచారం ఆపేసి ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ప్రాజెక్టులను పడావు పెట్టి, నిర్వహణ గాలికి వదిలి ఏపీకి నీళ్లు వదులుతున్న ఘనత రేవంత్ రెడ్డిదని ఎద్దేవా చేశారు. ఏడాదిన్నర పాలనలో జరిగిన ప్రాజెక్టుల ప్రమాదాలు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనాలని విమర్శించారు. పాలన వైఫల్యం, కాంగ్రెస్ చేతగాని తనం వల్లే ప్రాజెక్టుల వద్ద అనేక ప్రమాదాలు జరిగాయని స్పష్టం చేశారు. మేడిగడ్డ కుంగిన వెంటనే ఎన్డీఎస్ఏకు లేఖ రాసిన కిషన్ రెడ్డికి కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న ప్రాజెక్టుల ప్రమాదాలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డలో ఒక పియ్యర్ కుంగిపోతే మొత్తం ప్రాజెక్టే కుప్ప కూలిందని ప్రచారం చేసిన రేవంత్ రెడ్డి ఏడాదిన్నరలో జరిగిన ఘటనలకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే కొత్తగా ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తామని చెప్పి, ఆరు వేల ఎకరాలకు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో మళ్లీ నీళ్ల కోసం, నిధుల కోసం, నియామకాల కోసం కొట్లాడాల్సిన పరిస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లు తెరవాలని, తెలంగాణకు ప్రాణాధారమైన సాగునీటి రంగాన్ని రాజకీయ అజెండాలకు బలి చేయవద్దని హితవు పలికారు. తెలంగాణ ప్రజలు నీ రోత మాటలతో పాటు, నీ చేతగాని తనాన్ని గమనిస్తున్నారని తెలిపారు.





## చిన్నారిని దీవించిన కాంగ్రెస్ నాయకులు

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని సాదుల భద్రయ్య–రమ దంపతుల ప్రథమ పుత్రిక నూతన వస్త్ర పుష్పాలంకరణ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై చిన్నారిని దీవించారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య టౌన్ ప్రెసిడెంట్ బుర లక్ష్మణ్ గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ సీనియర్ నాయకులు సాదుల రాజు లు పాల్గొన్నారు.

## గీతకార్మికుడికి గాయాలు

అక్షర దర్బార్,రేగొండ : మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు ఓరుగంటి సాయిలు(45) రోజువారీగానే శుక్రవారం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఓరుగంటి సాయిలు కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు గమనించి అంబులెన్స్ ద్వారా పరకాల ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు.

## పాండవుల గుట్టలో సమాచార బోర్డు ఏర్పాటు

అక్షర దర్బార్, రేగొండ: మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో ఉన్న పాండవుల గుట్టలో జియో హెరిటేజ్ ఇన్ఫర్మేషన్ ప్యానెల్ బోర్డును జియెలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు ప్రారంభించారు. శుక్రవారం శాస్త్రవేత్తలు పాండవుల గుట్టను సందర్శించి పాండవుల గుట్ట రాళ్ల నిర్మాణాల ప్రాముఖ్యత, వయస్సు, పురాతన శిలా చిత్రాలు వంటి అంశాలను హైలెట్ చేస్తూ ఏర్పాటుచేసిన సమాచారం ప్యానెల్ బోర్డును జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ డా. మంజు ఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార బోర్డులో ఉన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే పాండవుల గుట్టలో కనిపించే భౌగోళిక లక్షణాలు, ప్యాలియోలిథిక్ జీవన చరిత్ర ఆధారాలను సందర్శకులు అర్థం చేసుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు డా.రమేష్ సామల,రమేష్ గుండా,తుషార్ చంద్ర పటేల్,అశోక్ కుమార్ కలబతులా హాజరయ్యారు.

# వసతుల కల్పనకు ప్రభుత్వానికి నివేదిక

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ
- కేఎంసీ, పీఎంఎస్ఎస్ వై, జీఎంహెచ్, ప్రభుత్వ ఛాతి, క్షయ, ఎంజీఎం, సీకేఎం ఆసుపత్రులను క్షేత్ర స్థాయిలో పరిశీలన



అక్షరదర్బార్, హనుమకొండ: ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు వైద్య విద్య కళాశాలలకు ఎన్ఎంసీ నిబంధనల మేరకు సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, తెలంగాణ ప్రభుత్వం నియమించిన కేఎంసీ, నర్సంపేట, జనగామ వైద్య కళాశాలల పర్యవేక్షణ కమిటీ ఛైర్పర్సన్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. శుక్రవారం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద స్నేహ శబరీష్ లతో కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ మోహన్ దాస్, వివిధ విభాగాధిపతులు, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని అనుబంధ ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతుల కల్పనకు కావలసిన వివిధ అంశాలపై కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా కాకతీయ మెడికల్ కళాశాలలో బోధన, బోధనేతర, ల్యాబ్, సిబ్బంది, కావాల్సిన వసతులపై సమీక్షించారు. కేఎంసీలోని హేమటాలజి విభాగాన్ని, వైద్య విద్యార్థినుల వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి వాటిని గురించిన వివరాలను ప్రిన్సిపల్ రామ్ కుమార్ రెడ్డిని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేఎంసీలో ఉన్న ప్రధానమంత్రి స్వస్త్య సురక్ష యోజన (పీఎంఎస్ఎస్ వై ) ఆసుపత్రిలోని పలు విభాగాలను జిల్లాల కలెక్టర్లు, వైద్యాధికారులతో కలిసి కమిషనర్ సందర్శించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని సందర్శించి ఓపి విభాగం, ఆరోగ్యశ్రీ, లేబర్ రూమ్, నియోనాటల్ వార్డ్ లను కమిషనర్ సందర్శించి ఆయా వార్డుల వివరాలు, ఓపి సేవలు, రిఫరల్స్, ఫాలో అప్, ప్రసూతి సేవలను గురించి, వైద్యులు, సిబ్బంది, తదితర వివరాలను వైద్యాధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేయూ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ ఛాతి, క్షయ వ్యాధుల ఆస్పత్రిని కమిషనర్ సందర్శించారు. వరంగల్ ఎంజీఎంతో పాటు సీకేఎం ఆస్పత్రులను సందర్శించి వాటి వివరాలను, సమకూర్చాల్సిన సౌకర్యాలను గురించి వైద్యాధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని, ఓపి విభాగాలను సందర్శించారు. ఎంజీఎం ఆసుపత్రిలోని ఈ ఔషధీ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. అదేవిధంగా ఎంజీఎం ఆసుపత్రిలో ఓపి సేవల విభాగంలో అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంజీఎం ఆస్పత్రుల్లోని నియోనాటల్ వార్డులను, వంట గదిని సందర్శించి అక్కడున్న సౌకర్యాలు, కావలసిన పరికరాలు, డాక్టర్లు, నర్సుల వివరాలు కమిషనర్ వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపి విభాగం, ఆరోగ్యశ్రీ, లేబర్ రూమ్, నియోనాటల్ వార్డ్ లను కమిషనర్ సందర్శించి ఆయా వార్డుల వివరాలు, ఓపి సేవలు, రిఫరల్స్, ఫాలో అప్, ప్రసూతి సేవల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.

# టీజీ ఎప్ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టా రెడ్డి బ్యాచ్‌లర్ ఆఫ్ ఇంజినీరింగ్ (బీటెక్) సీట్ల భర్తీకి సంబంధించిన ఎప్‌సెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేశారు. పాత ఫీజుల ప్రకారమే కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. మొత్తం మూడు దశల్లో బీటెక్ సీట్లను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. మొదటి విడత కౌన్సెలింగ్ జూన్ 28 నుంచి ప్రారంభమవుతుందన్నారు.

### - తొలి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్

సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్ జూన్ 28 నుంచి జూలై 7 వరకు
సర్టిఫికెట్ వెరిఫికేషన్ జూలై 1 నుంచి 8 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు జూలై 6 నుంచి 10 వరకు
ఫ్రీజింగ్ ఆప్షన్స్ జూలై 10
ఫస్ట్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్ జూలై 18
ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు, సెల్ఫ్ రిపోర్టింగ్ జూలై 18 నుంచి 22 వరకు

### - రెండో విడత..

సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు జూలై 25
(ఫస్ట్ ఫేజ్‌లో నమోదు చేసుకోని వారికి మాత్రమే)
సర్టిఫికెట్ వెరిఫికేషన్ జూలై 26
వెబ్ ఆప్షన్ల నమోదు జూలై 26 నుంచి 27 వరకు
ఫ్రీజింగ్ ఆప్షన్స్ 27
సెకండ్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్ జూలై 30
ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు, సెల్ఫ్ రిపోర్టింగ్ జూలై 30 నుంచి ఆగస్ట్ 1 వరకు
ఫిజికల్‌గా రిపోర్ట్ జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు

### - ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు స్లాట్ బుకింగ్
(ఫస్ట్, సెకండ్ ఫేజ్‌లో నమోదు చేసుకోని వారు మాత్రమే) ఆగస్టు 5
సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆగస్టు 6
వెబ్ ఆప్షన్ల నమోదు ఆగస్టు 6 నుంచి 7 వరకు
ఫ్రీజింగ్ ఆప్షన్స్ ఆగస్టు 7
సీట్ అలాట్‌మెంట్ ఆగస్టు 10
ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు, సెల్ఫ్ రిపోర్టింగ్ ఆగస్టు 10 నుంచి 12 వరకు
ఫిజికల్‌గా రిపోర్ట్ ఆగస్టు 11 నుంచి 13 వరకు

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915